

# ’అదే’ కథలు

## – ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని ‘దేశీ’లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం ‘య’ అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుకు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకి, బాధలకి, దుఃఖాలకి నా బాధ్యత లేదు.

## 61

## సమయపాలన

**రాజుగారు ఉండేది చికాగో** సిటీకి కొంచెం దూరంగా ఉండే ఆరోరాలో. ఆయనకో చిన్నపాటి బిజినెస్ ఉంది చికాగో డౌన్టౌన్ లో. రోజూ ట్రైన్ మీద వెళ్ళి వస్తూ ఉంటాడు. బిజినెస్ బాగున్నట్టే లెక్క. అయితే శనివారం కూడా వెళ్ళేపని ఉంది. లేకపోతే బిజినెస్ పోతుంది కదా? షాపులో ఫోను ఆన్సర్ చేయడానికో అమ్మాయి. చేతికింద పనికి మరో కుర్రాడూ పనిచేస్తూ ఉంటారు. ఎప్పుడైనా తన కొడుకూ కూతురూ వచ్చి ఓ చెయ్యి వేస్తారు సహాయానికి. రోజుకి దాదాపు అయిదారు వేల నుంచి పదివేల డాలర్ల దాకా అమ్మకాలు జరుగుతాయి ఈయన అమ్మే ఎలెక్ట్రానిక్ పార్టులూ, ఫోనులూ వగైరా. షాపు కి మంచిపేరే ఉంది. డబ్బున్నవాడి కిందే లెక్క. అయితే డబ్బున్న ప్రతీవాడు ఆరోరానుంచి డౌన్టౌన్ బండి వేసుకుని తిరగడు కదా? అసలే అది చికాగో, గాస్ ధరలు మండుతున్నై, అందులో మరీ డౌన్టౌన్. అక్కడ పార్కింగ్ నుంచి బాత్రూం దాకా అన్నీ కష్టమే. ఏమైతేనేం లోకల్ ట్రైన్ మీద రాజుగారి జీవితం బాగానే లాగుతోంది.

కొన్నాళ్ళకి రాజుగారికేదో అనుమానం వచ్చింది తన ఆరోగ్యం మీద. కడుపులో తేడా, ఆ పైన మరోటి. డాక్టర్ దగ్గిర తేలాడు. పొద్దున్నే పదింటికి రమ్మన్న డాక్టర్ ఆఫీసులో ఈయన్ని చూసేసరికి దాదాపు పన్నెండైంది. ఏవేం టెస్టులు చేయించాలి, మళ్ళీ ఎప్పుడు రావాలి, అన్నీ చెప్పి పంపించారు. అవన్నీ డాక్టర్ ఆఫీసులో మాట్లాడి బయటకి వచ్చేసరికి

రెండైంది. ఇంక ఆ రోజుకి డౌన్టౌన్ వెళ్ళడం అనవసరం. రోజు పోయినట్టే. కొట్లో కుర్రాడూ కుర్రమ్మా మేనేజ్ చేసారుట. అదొక అదృష్టం. అయితే డాక్టర్ ఆఫీసులో తాను తొమ్మిదింటికి వెళ్ళినా, కాయితాలు నింపమనీ, మరోటనీ తనని పదకొండు దాకా తొక్కేసారు; ఆ తర్వాత తనకన్నా వెనక వచ్చిన వాళ్ళని కూడా లోపలకి పంపారు కానీ డాక్టర్ రాజుగార్ని చూసే సరికి పన్నెండు. అవసరం తనది కనక నోరు మూసుకుని కూర్చున్నాడు రాజు గారు డాక్టర్ హాకిన్స్ గారి ఆఫీసులో. అయినా మొదటిసారి వెళ్ళినప్పుడు ఇలాగే అవుతుంది అన్ని డాక్టర్ల ఆఫీసులో అనుకుని ఎవరికీ చెప్పలేదూ, మాట్లాడలేదు. మరో మూడు వారాలు పోయాక మరోసారి వెళ్ళాలి టెస్ట్ రిజల్ట్స్ పట్టుకుని. ఈ లోపున ఒక లేబ్ ని పట్టుకుని రక్తం మూత్రం వగైరా అన్నీ పరీక్షలు చేయించారు. అవి డాక్టర్ దగ్గిరకి పంపాక వాళ్ళు ఫోన్ చేస్తారుట. సరే తన చేతిలో ఏమీలేదు కనక వేచి చూడ్డమే.

మరో వారానికి డాక్టర్ ఆఫీసు ఫోన్ చేసారు.

"వచ్చి డాక్టర్ ని కల్సుకోండి, మీ రిజల్ట్స్ వచ్చేయి."

అలా రాజుగారు రెండోసారి డాక్టర్ దగ్గిర తేలాడు. ఈ సారి కూడా రెండు గంటలు కూర్చోబెట్టి లోపలకి పిల్చాడు ఆయన. అసహనం ఎక్కువైనా భరించి లోపలకి వెళ్తే డాక్టర్ చెప్పేడు –

"మీ వంట్లో ఫలానా చోట ఫలానా ఎక్కువగా ఉంది. దీనికి రెండు కారణాలు, హెపటైటిస్ లేదా గాల్ స్టోన్స్ లేదా గాల్ బ్లేడర్ లో రాళ్ళు. అప్పుడు మరో మాట అడిగేడు. మీకు ఎంతమంది అడ/మొగవాళ్లతో సంబంధం ఉందీ ఎప్పుడైనా డబ్బులిచ్చి సుఖం కొనుక్కునే అలవాటు ఉందా?"

అలా హెపటైటిస్ అంటుకుందేమో అని ఆయన అనుమానం. ఇటువంటి ప్రశ్నకి కోపం వచ్చింది కానీ తమాయించుకుని చెప్పాడు –

" అబ్బే నాకు మా ఆవిడ తప్ప ఎవరూ లేరు; సుఖం కొనుక్కునే అలవాటు లేదు."

" సరే అయితే మరో టెస్ట్ అల్ట్రా సౌండ్ చేయించండి, వాళ్ళు మీ గాల్ బ్లేడర్ రాళ్ళ సంగతి చెప్తారు. ఫలానా చోట కుడివైపు నెప్పి వస్తోందా? అది గాల్ బ్లేడర్ నుంచే కావచ్చు. థేంక్యూ ఈ టెస్ట్ చేయించి మళ్ళీ రండి. ఇది ఫలానా లేబ్ లో చేస్తారు. మహా పెద్దగా నెప్పి వస్తే, రాళ్ళు బ్లాక్ చేస్తూంటే దాన్ని చిన్న సర్జరీ తో తీసేయవచ్చు."

మరో రెండువారాల తర్వాత మరో సారి డాక్టర్ ఆఫీసులో తేలాడు. ఈసారి అపాయింట్ మెంట్ మధ్యాహ్నం రెండింటికి. కానీ ఈయన్ని లోపలకి పిల్చేసరికి నాలుగున్నర! వళ్ళు మండుతూండగా లోపలకి వెళ్తే డాక్టర్ హాకిన్స్ చెప్పాడు,

"అవును నిజమే మీకు గాల్ స్టోన్స్ ఉన్నాయి – పెద్దవీ కాదు చిన్నవీ కాదు. సర్జరీ ఇప్పుడే అక్కర్లేదు కానీ ముందు ముందు జాగ్రత్తగా ఉండకపోతే సర్జరీ కావాలి. జాగ్రత్త ఏమిటంటే పిజ్జాలూ, నూనె, కొవ్వు ఎక్కువ ఉన్నవి తినరాదు. మీ

ట్రై గ్లిసరైడ్స్ కూడా ఆకాశంలో ఉన్నై. దానికి ఇదిగో మందు. మూడు వారాలు వాడి మరో సారి టెస్ట్ చేయించండి. రోజూ వ్యాయామం చేస్తూ ఉండండి. ఒక్కొక్కప్పుడు ఈ చిన్నచిన్న రాళ్ళు కరిగిపోయి మామూలుగా అవుతుంది. కంగారు లేదు."

అలా మందు చీటీ పట్టుకుని బయటకొచ్చాడు రాజుగారు. ఇంటికెళ్ళాక భార్యతో చెప్పి వంటలో మార్పులు సూచించాడు. దాని ప్రకారం లో–ఫేట్ డైట్ లో పడ్డారు. మూడు వారాలు మందువాడి, రోజూ వ్యాయామం చేస్తూ మొత్తానికి మరోసారి రక్తం, మూత్రం పరీక్ష చేయించాక మరో సారి డాక్టర్ గారి ఆఫీసులో తేలాడు. ఈ సారి కూడా రెండు గంటలు వెయిట్ అయ్యాక చెప్పారు

"ఈ రోజు డాక్టర్ గారు మిమ్మల్ని చూడలేరు, మరోసారి రండి."

మొహం మీద పేడనీళ్ళు జల్లినట్టై రాజుగారు అడిగారు,

"అమ్మా నేను ఇక్కడకి రావడం మొదటి సారి కాదు; ఎప్పుడొచ్చినా రెండు గంటలు లేటుగా చూస్తారు. నా బిజినెస్ పోతోంది దీనివల్ల. మీ డాక్టర్ కి టైమ్ ముఖ్యం అనుకుంటే నాకు ఇంకా ముఖ్యం. నా టైం గురించి ఏం చేస్తారు?"

తప్పు డాక్టర్ ది. ఆయన ఆఫీసులోంచి వెళ్ళిపోయాడు. ముందు ఆఫీసులో అమ్మడు సారీ చెప్పే ప్రసక్తి లేదు ఎందుకంటే తప్పు ఆవిడది కాదు. కాసేపు వాగ్యుద్ధం తర్వాత బయటకి వచ్చాడు, మరో రోజుకి అపాయింట్ మెంట్ కుదుర్చుకుని. ఈ సారి ఎలాగా రెండు గంటలు లేటుగా చూస్తారు కనక ఈయన లేటుగానే వెళ్ళాడు.

అయితే ఈ సారి మరో ఎదురుదెబ్బ తగిలింది. డాక్టర్ గారు ఈయన కోసం చూసారుట. ఈయన లేటుగా వెళ్ళారు కనక అపాయింట్ మెంట్ మరొకరికి ఇచ్చేసారు. మరోసారి రండి. అయితే లేటు ఫీజ్ కట్టుకోవాలి. లేటు ఫీజు డబ్భై డాలర్లుట. వాగ్యుద్ధం అయ్యాక అది కట్టనని చెప్పి బయటకొచ్చాడు. వళ్ళు మండుతోంది ఏం చేయాలో తెలియదు. రెండురోజులకి మామూలుగా అయ్యాక డాక్టర్ ఆఫీసుకి ఫోన్ చేసాడు. లేట్ ఫీజు కట్టకపోతే డాక్టర్ గారు చూడరని సమాధానం వచ్చింది. ఈ సారి కోపం నషాళానికి అంటింది. కానీ అవసరం తనది, డాక్టర్ దగ్గిర తన రిజల్ట్స్ ఉన్నై. అందువల్ల కోపం అణుచుకుని డబ్భై డాలర్లూ క్రెడిట్ కార్డుతో కట్టి మరోసారి డాక్టర్ దగ్గిర తేలాడు. ఈ సారి కూడా రెండు గంటల తర్వాత లోపలకి పిల్చారు.

"హమ్మయ్య, రక్తం లో ఫలానా బైల్ రూబిన్ అనేది తగ్గింది. మందు పనిచేస్తోంది, ఇదే దారిలో వెళ్ళి మరో ఆరునెలల తర్వాత రండి. ప్రస్తుతం అన్ని నార్మల్ గా ఉన్నాయి."

అలా బయటకి వచ్చేడు రాజు గారు. ఆ పై వారాంతంలో ఇంటర్నెట్ మీద పడి మిగతా విషయాలు సంపాదించాడు. డాక్టర్లు ఇలా పేషెంట్లని రెండేసి గంటలు కూర్చోబెట్టడం, ఒక్కోప్పుడు వచ్చినవాళ్లని చూడకుండా పంపడం, తప్పు లేశమాత్రం ఉన్నా లేట్ ఫీజు అనేది గుంజుకోవడం అనేవాటికి ఏం చేయొచ్చో. అన్నీ తెలిసాక కూర్చుని లెక్కలు కట్టాడు. తనని నాలుగు సార్లు పిల్చారు లేదా డాక్టర్ దగ్గిరకి తాను నాలుగుసార్లు వెళ్ళాడు. ప్రతీసారి రెండేసి

గంటల వేస్టు, ఆ తర్వాత మిగతా అర్ధరోజూ వేస్టు. ఓసారి తనని చూడనే లేదు. లేటుగా చూస్తున్నారు కదా అని లేటుగా వెళ్తే డబ్బై డాలర్లు కట్టమన్నారు. తనకి ఇవన్నీ చూస్తే మొత్తం నాలుగు రోజుల లేదా నలభై గంటలు నష్టం. దాదాపు ఒక వారంలో మామూలు జనం పనిచేసేంత నష్టం. తన బిజినెస్ నష్టం ఎవరు పూడుస్తారు? ఇదంతా ఆలోచించి ఏం చేయాలో నిశ్చయించుకున్నాక హాయిగా నిద్దర పట్టింది రాజుగారికి.

ఇది జరిగిన మూడో వారానికి డాక్టర్ హాకిన్స్ గారి ఆఫీసుకో లాయర్ నోటీస్ వచ్చింది, ఆయన పేరుమీదే, రాజుగారి దగ్గిర నుంచి, ఏదో క్లైమ్స్ కోర్టుట. డాక్టర్ గారు కోర్టు వెళ్ళకపోతే రానందుకు ఆటోమేటిగ్గా రాజుగారు నెగ్గుతారు. అందువల్ల చచ్చినట్టు వచ్చాడు హాకిన్స్. "ఎందుకిలా కూర్చోబెట్టారు రాజుగారిని?" అని అడిగితే సరైన సమాధానం లేదు – పేషెంట్లు ఎక్కువ ఉన్నారనీ, మరోటనీ మరోటనీ చెప్పాడు కానీ జడ్జ్ కి అవేం నచ్చలేదు.

"మీరు ఫలానా టైమ్ కి రావాలి అంటారు ఓ అరగంట వెయిటింగ్ ఎలాగా తప్పదు కానీ నాలుగుసార్లు ఈయన్ని ఎందుకలా చేసారు? ప్రతీసారి పేషెంట్ల తాకిడి అయితే అపాయింట్ మెంట్ ఎందుకిచ్చారు; ఓవర్ బుకింగ్ చేయడం దేనికీ? మీ అపాయింట్ మేంట్ కోసం జనం ఉద్యోగాలకి శెలవు పెట్టి మరీ వస్తారు కదా, అటువంటప్పుడు వాళ్ల సమయానికి విలువ ఇవ్వలేరా? డాక్టర్ అయితే ఏమిటి మీ గొప్ప?"

వీటికి హాకిన్స్ ఏవో చెప్పాడు కానీ జడ్జ్ వినిపించుకోలేదు. ఇటువైపు రాజుగారి వాదన మరింత బలంగా ఉంది. ఆయనకి ఉన్నది స్వంత బిజినెస్. సమయానికి వెళ్లకపోతే పనిచేసే కుర్రాడూ, కుర్రమ్మా ఎప్పుడైనా సహాయం చేస్తారు కానీ ప్రతీసారి చేయలేరు; మోసం చేయొచ్చేమో కూడా. అందువల్ల ఈయన బిజినెస్ లో నష్టం అనేది ఆయన చూపించిన లెక్క ప్రకారం నిజమే. అవి ఆరువేలనుంచి పదిహేనువేల డాలర్ల దాకా ఉన్నాయి. ఇవి ఎవరు కడతారు? డాక్టర్ కి టైమ్ ఎంత ముఖ్యమో రాజుగారి టైమ్ దానికంటే ఎక్కువ ముఖ్యంగా కనబడుతోంది. అన్నీ విన్నాక జడ్జ్ చెప్పేడు –

" రాజుగారికి డాక్టర్ గారు పన్నెండువేలు కట్టాలి ఫలానా రోజు లోపున. పిచ్చి పిచ్చి వేషాలు వేస్తే వడ్డీతో సహా కట్టాల్సి ఉంటుంది."

మొహం మాడిపోయిన డాక్టర్ గొణుక్కుంటూ బయటకి వెళ్లిపోయేడు కోర్టులోంచి.

నీతి: సమయపాలన అనేది ప్రతీ ఒక్కరికీ వర్తిస్తుంది. మీరు డాక్టర్ కదా అని ప్రజల సమయంతో ఆటలాడుకోవడం కుదరదు.

Post your comments